హరిత హోటల్‌ను పరిశీలించిన కలెక్టర్

తాడ్వాయి, ఫిబ్రవరి 2 : మేడారం హరిత హోటల్ మరమ్మతులను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం పరిశీలించారు. మహాజాతర సమీపిస్తున్నందును హోటల్ పనులను పూర్తి చేసి వీవీఐపీలు విడిది చేసేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. అనంతరం ఊరట్టం నుంచి కాల్వపల్లి రహదారి నిర్మాణ పనులు కొంగలమడుగు నుంచి చింతల్ క్రాస్ వరకు జరుగుతున్న సీసీ రోడ్ల పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలన్నారు. అలాగే మేడారంలో ఎయిర్‌టెల్ సంస్థ ఏర్పాటు చేసిన శాశ్వత టవర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. భక్తుల రద్దీ పెరుగుతుండడంతో ప్రస్తుతం మేడారంలో ఉన్న సెల్ సేవలు భక్తులకు ఇబ్బందికరంగా మారడంతో ఎయిర్‌టెల్ సంస్థ మేడారం, ఎల్బాక, ప్రాజెక్టునగర్ ప్రాంతాల్లో టవర్లను ఏర్పాటు చేసింది. ఇండస్ టవర్స్ సీఈవో దిలీప్‌కుమార్ మాట్లాడుతూ జాతర సమయంలో మరో 12 తాత్కాలిక టవర్లను ఏర్పాటు చేసి భక్తులకు సేవలు అందిస్తామని తెలిపారు.

ఎయిర్‌టెల్ టవర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కేజీబీవీల్లో మౌలిక వసతులు

జిల్లా విద్యాశాఖ అధికారి రాంకుమార్

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు.. 500 ఎల్‌పీహెచ్ ఆర్‌వో ప్లాంట్, 3 వేల ఎల్‌పీడీ ఈటీసీ మోడల్ సోలార్ వాటర్ హీటింగ్ సిస్టం, 3 వేల లీటర్ల కెపాసిటీ పీవీసీ స్టోరేజీ ట్యాంక్‌లను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ రాంకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనులు పూర్తి చేయడానికి ఆసక్తి గల కాంట్రాక్టర్లు ఫిబ్రవరి 9న డీఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 9849141806ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సైన్స్ కిట్లను డీఈవోకు అందిస్తున్న విద్యాసాగర్‌రెడ్డి

సైన్స్ కిట్లను వినియోగించుకోవాలి

ములుగు రూరల్, ఫిబ్రవరి 2 : విద్యార్థులు సైన్స్ కిట్లు వినియోగించుకోవాలని డీఈవో అబ్దుల్‌హై అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఫిజికల్ సైన్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం శుక్రవారం జరిగింది. సూర్య కిరణ్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా అధ్యక్షుడు తుడి విద్యాసాగర్‌రెడ్డి ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు 16 ప్రయోగాలకు సంబంధించిన సైన్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రయోగాత్మకంగా విద్యార్థులకు బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, డీసీఈబీ కార్యదర్శి విజయమ్మ, ఎంఈవో శ్రీనివాసులు, రిసోర్స్ పర్సన్లు సతీశ్‌కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాకీలు కట్టాలని మిల్లులకు నోటీసులు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : జిల్లాలో 2022-23 వానకాలం పండించిన 82,320 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని జిల్లాలోని 26 మిల్లులకు రైస్ మిల్లింగ్ కోసం ఇవ్వడం జరిగిందని, దీనికి గాను 55,481 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా, 54,427 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చారని, ఇంకా మిగిలిన 1055 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మొగుళ్లపల్లి సువర్ణలక్ష్మి శ్రీనివాస్ ట్రేడర్స్, దామెరకుంట రుద్ర రైస్ మిల్లు, ఇప్పలపల్లి వాగ్దేవి ఇండస్ట్రీస్, చెల్పూర్ ఆదిత్య ట్రేడర్స్, చెల్పూర్ హరిహర ట్రేడర్స్ మిల్లులు ఇవ్వాలని సివిల్ సప్లై డీఎం రాఘవేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాకీ ఉన్న మిల్లులకు డబ్బులు కట్టాలని నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఒక వేళ కట్టకుంటే సంబంధిత మిల్లులపై క్రిమినల్ కేసులు పెట్టి, బాకీ మొత్తాన్ని రికవరీ చేయనున్నట్లు తెలిపారు.

పేదల కోసమే ఉపాధి హామీ

ఏటూరునాగారం, ఫిబ్రవరి 2 : పేదల కోసమే ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకాన్ని తీసుకొచ్చిందని ఈజీఎస్ ఏపీవో చరణ్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని ఎర్రకుంట చెరువు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకం, మేకలు, గేదెలు, కోళ్ల షెడ్ల నిర్మాణంతో పాటు చేపల చెరువుల ఏర్పాటు చేసుకునే అవకాశాలు ఈ పథకం కింద ఉన్నాయన్నారు. జాబ్ కార్డులు ఉన్న వారంతా కూడా పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సాంబశివరావు, కూలీలు పాల్గొన్నారు.

యువకుడి అరెస్టు

రేగొండ, ఫిబ్రవరి 2 : ప్రేమ పేరుతో బాలికను నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మడ్డపల్లి గ్రామానికి చెందిన ఓ బాలిక వరంగల్ కేఎంసీ సమీపంలోని ఫాస్ట్‌పుడ్ సెంటర్‌లో పనిచేస్తున్నది. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన రషీద్‌ఖాన్‌తో పరిచయం ఏర్పడింది. పెండ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. తనను పెళ్లి చేసుకోవాలని కోరడంతో నిరాకరించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈ విషయం బాలిక తల్లికి చెప్పడంతో ఇటీవల రేగొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి చిట్యాల సీఐ వేణుచందర్ ఆదేశాల మేరకు పోలీసులు నిందితుడిని పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, **KONDAM SUKANYA** (New Name), previously called **BUCHAMMA CHANDUPATLA** (Old Name), R/o. H.No. 31-1-253/6, Bhadrakali Nagar, Road No.2, Bheemaram Village, Hasanparthy Mandal, Hanumakonda Dist., T.S., India. solemnly declare

లోన్స్
★SBI లో ఖాతా ఉన్న ప్రభుత్వ ఉద్యోగస్తులకు శుభవార్త.. ఎటువంటి సమస్యలున్న Solve చేసి అన్ని రకాల లోన్స్ ఇప్పించబడును. సంప్రదించండి సెల్: 9493910808.
NTW-321488

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

నాసిరకంగా నిర్మించిన పిల్లర్లు

కందకం లేకుండా నేలపై నిర్మిస్తున్న ప్రహరీ

నాసిరకం పనులు.. అసంపూర్తి నిర్మాణాలు

- అధికారుల పర్యవేక్షణ కరువు
- జాతర అభివృద్ధి పనుల్లో లోపిస్తున్న నాణ్యత
- నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లు
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా

ములుగు, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : మేడారం మహా జాతర అభివృద్ధి పనుల్లో నాణ్యతాలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. అధికారుల అండదండలతో కాంట్రాక్టర్లు ప్రజాధనం దండుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి మేడారం వచ్చే భక్తులు, పర్యాటక ప్రాతాలను సందర్శించే ప్రజల సౌకర్యార్థం కేసీఆర్ ప్రభుత్వం రూ.4.50కోట్లతో ములుగు మండలం ఇంచర్ల ఎర్రిగట్టమ్మ వద్ద, గోవిందరావుపేట మండలం చల్వాయి, తాడ్వాయి మండల కేంద్రంలో మూడు కిచెన్ షెడ్లను నిర్మించింది. వాటిని ఇటీవల మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ జాతరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.75కోట్లు మంజూరు చేయగా అందులో మూడు కిచెన్ షెడ్ల చుట్టూ ప్రహరీతో పాటు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ద్వారా రూ.2.30 కోట్లతో పనులు చేపట్టారు. ఎర్రి గట్టమ్మ, చల్వాయి కిచెన్ షెడ్‌ల వద్ద పనులను ఒకే కాంట్రాక్టర్‌కు టెండర్ ద్వారా అధికారులు పనులు కేటాయించారు. జనవరి 31 వరకు పనులు పూర్తి చేయాలని నిర్దేశించారు. తాడ్వాయి కిచెన్ షెడ్ వద్ద మరో కాంట్రాక్టర్‌కు అప్పగించి పనులను ఈ నెల 10 వరకు పూర్తి చేయాలని గడువు విధించారు. ఐటీడీఏ ఇంజినీరింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నాసిరకంగా చేపడుతున్నారు. అన్ని చోట్ల ఇప్పటి వరకు సగం కూడా పనులు పూర్తి కాలేదు. ప్రహరీ మాత్రం సగం పూర్తయింది. సీసీ రోడ్లు ఇంత వరకు మొదలు పెట్టలేదు.

కొట్టొస్తున్న నాణ్యతాలోపం

కిచెన్ షెడ్ల ప్రహరీ నిర్మాణంలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ప్రభుత్వ నిబంధనల మేరకు కాకుండా కందకం తీయకుండా అక్కడక్కడా పిల్లర్లు వేసి సిమెంట్ ఇటుకలతో ప్రహరీ నిర్మిస్తున్నారు. ఎర్రి గట్టమ్మ వద్ద రూ.85 లక్షలు, చల్వాయి వద్ద రూ.70 లక్షలతో ప్రహరీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. డిసెంబర్ 17న మేడారంలో మంత్రులు నిర్వహించిన సమీక్షలో అధికారులు పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. కానీ, ఇప్పటి వరకు రెండు ప్రాంతాల్లో ప్రహరీ పనులు పూర్తి కాలేదు. సీసీ రోడ్లు పనులు ఇంకా మొదలు పెట్టనేలేదు. నాణ్యతపై చర్యలు చేపట్టాల్సిన ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జాతర పేరుతో హడావుడిగా పనులు చేస్తూ నాణ్యత లేని మెటీరియల్‌ను నిర్మాణాలకు వినియోగిస్తున్నారు. కట్టిన సిమెంట్ గోడలకు కనీసం క్యూరింగ్‌ను కూడా నిర్వహించడం లేదు.

ఎస్వోలు సమర్థంగా విధులు నిర్వర్తించాలి

- ఎంపీడీవోల ద్వారా డిజిటల్ కీ తీసుకోండి
- కలెక్టర్ భవేశ్‌మిశ్రా

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : గ్రామ పంచాయతీల్లో నూతనంగా నియమితులైన స్పెషల్ ఆఫీసర్లు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుంచి అన్ని మండలాల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో, తహసీల్దార్, పంచాయతీల స్పెషల్ ఆఫీసర్లతో నిర్వహించాల్సిన విధులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు.. ప్రతి పంచాయతీకి స్పెషల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 241 పంచాయతీలో నేటి నుంచి స్పెషల్ ఆఫీసర్లు విధులు నిర్వర్తించనున్నారని తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ల విధి విధానాలను తెలిపే ప్రత్యేక పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ప్రతి స్పెషల్ ఆఫీసర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పంపించడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీలో చేయాల్సిన పనులపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరా చేయాలని సూచించారు. గతేడాది హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షిస్తూ చనిపోయిన మొక్కల జాబితాను తయారు చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోల ద్వారా డిజిటల్ కీ తీసుకోవాలని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, మండలాల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

పలిమెల ఎస్వోగా బాధ్యతలు స్వీకరిస్తున్న డీఏవో విజయ్ భాస్కర్

పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల నియామకం

పలిమెల, ఫిబ్రవరి 2: గ్రామ సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. పలిమెల పంచాయతీకి ప్రత్యేకాధికారిగా జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, పంకెన, మోదేడు పంచాయతీలకు ఎంపీడీవో శ్రీనివాస్, సర్వాయిపేట, లెంకలగడ్డ పంచాయతీలకు తహసీల్దార్ హేమ, ముకునూరు పంచాయతీకి మండల పంచాయతీ అధికారి ప్రకాశ్‌రెడ్డి, దమ్మూరు, నీలంపల్లి పంచాయతీలకు మిషన్ భగీరథ ఏఈ సాయిరాం నియమితులయ్యారు. వారికి కేటాయించిన పంచాయతీలకు వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతి

వెంకటాపురం (నూగూరు) ఫిబ్రవరి 2 : గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం శుక్రవారం దొరికింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పామేడు గ్రామానికి చెందిన రాజు(45) సూరవీడులోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చాడు. గురువారం గోదావరి నదిలో స్నానం చేసేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. అతడి కోసం బంధువులు, గ్రామస్తులు పడవలు, వలలతో నదిలో గాలించగా శుక్రవారం మృతదేహం లభ్యమైంది.

జూనియర్ కళాశాలలో వైద్య శిబిరం

మహదేవపూర్, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం భూపాలపల్లి జిల్లా ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి రవి, దీప్తి ఆధ్వర్యంలో అనీమియా ముక్త్‌భారత్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు హిమోగ్లోబిన్ వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనీమియా లక్షణాలు, చికిత్స విధానం, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమేశ్, అధ్యాపకులు సదాశివ్, శైలజ, నాగలక్ష్మి, పోచయ్య పాల్గొన్నారు.

గుడాడ్‌పల్లి జీపీ పాలకవర్గానికి వీడ్కోలు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : భూపాలపల్లి మండలంలోని గుడాడ్‌పల్లి జీపీ పాలకవర్గానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు వీడ్కోలు పలికారు. శుక్రవారం జీపీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గం సభ్యులను అధికారులు, ప్రజా ప్రతినిధులు వీడ్కోలు పలికి, ఘనంగా సన్మానించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కే శోభా రఘుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు

కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌శర్మ

మహదేవపూర్, ఫిబ్రవరి 2 : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు.. జడ్పీటీసీ అరుణా శ్రీనివాస్ మండల కేంద్రంలోని గర్భగౌరీదేవి ఆలయ అభివృద్ధికి రూ. లక్షా పది వేలు, నూతన కమిటీ హాల్ నిర్మాణానికి రూ. 5 లక్షల నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌శర్మ శుక్రవారం తెలిపారు. ఆలయ అభివృద్ధి నిధులు కేటాయించడంపై ఆలయ కమిటీ సభ్యులు మంత్రి, జడ్పీటీసీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాధితులకు ఎమ్మెల్సీ సిరికొండ పరామర్శ

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 2 : భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు రాచర్ల ప్రభాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శాసన సభ మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు శ్రీరాములు, రవి, ఖలీద్, రమేశ్, అశోక్ రెడ్డి, రాజిరెడ్డి, సదానందం, రవి, ఐలయ్య, ఓదేలు ఉన్నారు.

ప్రభాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 2 : బైక్ చెట్టును ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని పెద్దబోయిన సాయి, పెద్దబోయిన రఘుపతి, మాటూరి మధు మణుగూరులో ఓ కార్యక్రమానికి వెళ్లి బైక్‌పై వస్తుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం జానంపేట సమీపంలో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ముగ్గురి కాళ్లు విరిగాయి. వారిని మణుగూరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

శాంపిల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నిత్యావసరాల శాంపిల్స్ పరిశీలన

ఏటూరునాగారం, ఫిబ్రవరి 2 : ఆశ్రమ, గురుకుల పాఠశాలలకు ఈనెల నుంచి ఏప్రిల్ వరకు నిత్యావసర సరుకులు సరఫరా కోసం టెండరు దారులు సమర్పించిన శాంపిల్స్ కొనుగోలు కమిటీ ఐటీడీఏ కార్యాలయంలో పరిశీలించింది. మూడు నెలలకు సరిపోయే సరుకుల సరఫరాకు అధికారులు టెండర్లు పిలవగా వారు శాంపిల్స్ అందజేశారు. గిరిజన సంక్షేమశాఖ డీడీ పోచం, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, గురుకులాల ఆర్సీవో అగస్టీన్, జీసీసీ సొసైటీ మేనేజర్లు దేవ్, హరిలాల్, శ్రీనివాస్, సమ్మయ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీలత పాల్గొన్నారు.

మేడారానికి పోటెత్తిన భక్తులు

- తల్లులకు ముందస్తు మొక్కులు
- కిటకిటలాడుతున్న జాతర పరిసరాలు

తాడ్వాయి, ఫిబ్రవరి 2 : దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా కొనసాగుతున్న మేడారం సమ్మక్క-సారలమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. మహా జాతరకు మరికొద్ది రోజుల సమయమే ఉన్నప్పటికీ కుటుంబ సమేతంగా వచ్చి మొక్కులు చెల్లిస్తున్నారు. శుక్రవాం రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి తలనీలాలు సమర్పిస్తున్నారు. అనంతరం గద్దెల వద్దకు చేరుకొని పసుపు, కుంకుమ, ఎత్తు బెల్లం సమర్పించి పూజలు చేశారు. భక్తుల రాకతో మేడారం పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. దేవాదాయశాఖ అధికారులు, పోలీసులు పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేశారు. క్యూలైన్లలోనే దర్శనానికి అనుమతించారు. శుక్రవారం ఉదయం ఆరుగంటల నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. వాహనాలతో పార్కింగ్ ప్రదేశాలు నిండిపోయాయి. మొదటగా గద్దెల సమీపంలోకి వాహనాలను అనుమతిచ్చిన పోలీసులు భక్తుల రద్దీని బట్టి రెడ్డిగూడెం క్రాస్, స్తూపం వద్ద గల పార్కింగ్ ప్రదేశాలకు తరలించారు.

అమ్మవార్ల గద్దెల వద్ద భక్తుల రద్దీ

ముమ్మరంగా పారిశుధ్య పనులు

జాతర పరిసరాల్లో పంచాయతీ అధికారులు ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం జాతర పరిసరాల్లో తొమ్మిది మంది ఎంపీడీవోలు, 174 మంది ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించిన అధికారులు పారిశుధ్యం పేరుకుపోకుండా చేపట్టారు. అలాగే వీవీఐపీలు ఉండేందుకు హరిత హోటల్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న పాటు కాటేజీల పనులను డీపీవో వెంకయ్య పరిశీలించారు.

పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పెంపు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ దరఖాస్తు గడువు మార్చి 31వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని కళాశాలల్లో చదువుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగ, మైనార్టీ ఫ్రెష్, రెన్యువల్ విద్యార్థులు http:// telanganae pass.cgg.gov.in ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

ప్రజలను భ్రమల్లో ముంచే కేంద్ర బడ్జెట్

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 2 : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలోని కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టడానికి, ఓటర్లను భ్రమల్లో ముంచే బడ్జెట్‌గా ఉందని సీపీఎం జిల్లా కార్యాదర్శి బందు సాయిలు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికలను దృష్టితో పెట్టుకొని ప్రవేశపెట్టిన బడ్జెట్ అని, ఈ బడ్జెట్ దారిద్ర్య రేఖకు దిగువనున్న వారికి ప్రయోజనం కల్పించే బడ్జెట్ కాదన్నారు. ప్రజలు బీజేపీని ఎవ్వరూ నమ్మే స్థితిలో లేరన్నారు. ఎన్నికల్లో బీజేపీ చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న కొప్పుల ఈశ్వర్, పుట్ట మధు

బీఆర్ఎస్ ప్రమాద బీమా చెక్కు అందజేత

మహదేవపూర్, ఫిబ్రవరి 2 : మండల పరిధిలోని బొమ్మాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పీ మల్లయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా, మృతుడి భార్య పోచమ్మకు బీఆర్ఎస్ ప్రమాద బీమా రూ.2 లక్షల విలువ చేసే చెక్కును మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, పెద్దపల్లి జిల్లా జడ్పీ చైర్మన్ పుట్ట మధు మంథనిలోని ఎస్ఎల్‌బీ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో అందజేశారు. బీఆర్ఎస్ పార్టీకి రుణపడి ఉంటామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు చందర్, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకడు రాకేశ్, బొమ్మాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పద్మారవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో భయం తొలగించేందుకే టెలీమానస్

ఇంటర్ జిల్లా నోడల్ అధికారి దేవరాజం

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : ఇంటర్ విద్యార్థులకు మానసిక స్థైర్యాన్ని పెంపొందించడానికి, పరీక్షలపై భయం తొలగించడానికి, మానసిక ఆందోళనలు పోగొట్టడానికి టెలీమానస్-టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి దేవరాజం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సైకాలజిస్టులు టెలీమానస్-టోల్ ఫ్రీ నంబర్ 14416, 1800-914416 ద్వారా 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 2 : త్వరలో నిర్వహించనున్న ఖమ్మం, నల్గొండ, వరంగల్ గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు కే జనార్దన్ పటేల్ శుక్రవారం కోరారు. భూపాలపల్లి పట్టణ ప్రజలు ఈ నెల 6వ తేదీలోపు ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నాపై కక్ష సాధింపు

పూజారుల సంఘం అధ్యక్షుడిపై సారలమ్మ పూజారి ఆరోపణ

తాడ్వాయి, ఫిబ్రవరి 2 : సమ్మక్క, సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని సారలమ్మ పూజారి కాక అమృతమ్మ ఆరోపించారు. శుక్రవారం ఆమె గద్దెల ప్రాంగణంలో మాట్లాడారు. జాతరలో తనకు రావాల్సిన వాటా, పూజారులకు ఇచ్చే నిత్యావసర సరుకులు ఇవ్వకుండా అడ్డుకుంటుందన్నారు. తాను సారలమ్మ ప్రధాన పూజారి అయినప్పటికీ పూజారుల సంఘంతో ముంద్రించి క్యాలెండర్‌లో తన పేరుకు బదులు చనిపోయిన అత్త కాక ముత్యంబాయమ్మ పేరును ముద్రించారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 జాతర నుంచి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తెలిపారు. మిగతా పూజారుల కుటుంబ సభ్యులు చనిపోతే వారసత్వం ఇస్తున్నారని, తన అత్త చనిపోతే తనకు వారసత్వం ఉండదంటూ ఇబ్బందులకు గురిచేస్తే కోర్టుకు వెళ్లి హక్కులు సాధించుకున్నట్లు చెప్పారు. 11మంది పూజారులం ఎన్నుకుంటే అధ్యక్షుడయ్యాడని, కానీ, పూజారులకు వచ్చే బెల్లం, లిక్కర్, పసుపు, కుంకుమల షాపులు ఒక్కడే అమ్ముకుంటున్నాడని ఆరోపించారు. ఈ విషయమై తనకు న్యాయం చేయాలని శుక్రవారం ఈవో రాజేంద్రంతో పాటు సీఐ శంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

రాజుపేటలో ఇల్లు దగ్ధం

మంగపేట, ఫిబ్రవరి 2 : మండలంలోని రాజుపేటకు చెందిన మోదుగు రాములు ఇల్లు గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైంది. ఆ సమయంలో ఇం ట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఇంటిపై కప్పు తాటాకులతో కప్పి ఉండటంతో మంటలు వేగంగా అంటుకొని ఇల్లు, సామగ్రి కాలి బూడిదైంది. సుమారు రూ.3లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. తహసీల్దార్ వీరస్వామి పరిశీలించి బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. ఆయన వెంట డిప్యూ టీ తహసీల్దార్ మల్లేశ్వర్ రావు, ఆర్ఐ కుమారస్వామి ఉన్నారు.

మోదీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

కాటారం, ఫిబ్రవరి 2 : కులం, మతాల పేరుతో ప్రజలను విభజిస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న ప్రధాని మోదీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజాసంఘాల నాయకుడు అక్కల బాపు తెలిపారు. ఈ మేరకు కాటారంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంపదను కార్పొరేట్ వ్యవస్థకు అప్పగిస్తుందన్నారు. అంబానీ లాంటి బడా కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా తాకట్టు పెడుతున్నాడని, ఈ వాస్తవాలపై ప్రజాసంఘాలు పోరాటం చేయాల్సినవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్, శంకర్, రమేశ్ పాల్గొన్నారు.

చిన్నారి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు

మృతదేహంతో నిందితుడి ఇంటి ఎదుట ఆందోళన

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 2 : చిన్నారి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఏటూరు గ్రామానికి చెందిన దాచేపల్లి శ్రావణి-విజయ్ దంపతుల కూతురు శిరీష (7) రోడ్డుపై ఉండగా మంగళవారం రాత్రి బుట్టాయిగూడెం గ్రామానికి తాడూరిశ్రీధర్ కారుతో ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలపాలైన బాలికను వరంగల్‌లోని ఓ ప్రవేట్ దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 304 ఎ, నమోదు చేసినట్లు వివరించారు.

నిందితుడి ఇంటి ఎదుట బంధువుల ఆందోళన

గురువారం రాత్రి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు బాలిక మృతదేహంతో బుట్టాయిగూడెంలోని నిందితుడి ఇంటి ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. నిందితుడు కేసును తప్పుదోవ పట్టించేందుకు బాధితులను భయభ్రాంతులకు గురిచేసినట్లు తెలిసింది. అంతేకాకుండా రెండు గంటలకు పైగా బేరసారాలు చేసి కొంత నగదు ఇచ్చేందుకు ఒప్పుకొని అక్కడి నుంచి పంపించాడు. కాగా, బాలిక ప్రాణానికి వెలకట్టడమేంటని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.


నిందితుడి ఇంటి ఎదుట శిరీష మృతదేహంతో బైఠాయించిన బాధితులు